www.aksharadarbar.com
మంగళవారం 17, సెప్టెంబర్ 2024
అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక వరంగల్ | సంపుటి :02 | సంచిక :191 | పేజీలు : 05 | వెల : 05

వరంగల్‌పై సీఎం ప్రత్యేక దృష్టి

- విద్య, వైద్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం
- పాత్రికేయులకు ఇంటి స్థలాలు అందిస్తాం..
- అర్హుల జాబితాను కమిటీలు అందజేయాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్షా సమావేశం

04

ఘనంగా ప్రజాపాలన

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో వైభవంగా వేడుకలు
- వరంగల్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి
- హన్మకొండలో కొండా సురేఖ, ములుగులో సీతక్క

04

రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా
రాణి కుమిదిని

- విజిలెన్స్ కమిషనర్‌గా గోపాల్ నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ సర్కార్

02

డీల్@ రూ. 25 లక్షలు!

- ఒప్పందం కుదిరాకే భూమి అక్రమ రిజిస్ట్రేషన్ కు స్కెచ్
- కబ్జాదారులకు అండగా నిలిచిన తహసీల్దార్ కిరణ్ కుమార్
- భూమి యజమానురాలు బతికుండగానే చనిపోయినట్లు పత్రాల సృష్టి..

02

యజమానురాలికి తెలియకుండా ఆమెకు చెందిన రూ.కోట్ల విలువ చేసే రెండున్నర ఎకరాల భూమిని అక్రమంగా కొల్లగొట్టిన ఘటనలో తహసీల్దార్ పూజారి కిరణ్‌కుమార్ కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. హనుమకొండ జిల్లా కాజీపేట మండల తహసీల్దార్ గా పనిచేసిన సమయంలో ఆయన అంతులేని అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా భూముల రిజిస్ట్రేషన్లలో కిరణ్ కుమార్ ఇష్టారాజ్యంగా వ్యవహరించినట్లు తెలిసింది. ఈ క్రమంలో కాజీపేట మండలం మడికొండలోని ఓ సర్వే నంబర్‌లో అత్యంత విలువైన రెండున్నర ఎకరాల భూమి చేతులు మారడం వెనుక సార్ తనదైన స్టైల్‌లో చక్రం తిప్పినట్లు సమాచారం. పక్కా ప్లాన్ ప్రకారం భూమి రిజిస్ట్రేషన్ జరిగినట్లు స్పష్టం అవుతోంది. కబ్జాదారులతో ముందుగానే ఒప్పందం చేసుకొని ఆ తర్వాత ఫైళ్లపై సంతకాలు పెట్టారని, ఇందుకోసం తహసీల్దార్ రూ. 25 లక్షల ముడుపులు పుచ్చుకున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. అనంతరం ప్లాట్లుచేసి విక్రయిచంగా అందులోనూ సార్‌కు పర్సంటేజీ ముట్టినట్లు చెపుతున్నారు. భూమి యజమానురాలైన వృద్ధురాలు బతికుండగానే, చనిపోయినట్లు కేటుగాళ్లు నకిలీ పత్రాలు సృష్టిస్తే .. దాన్ని అడ్డుకోవాల్సింది పోయి.. తహసిల్దార్ వారితోనే చేతులు కలిపి తీరని అన్యాయం చేశారని బాధితురాలి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. - అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి

అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక

- ఒప్పందం కుదిరాకే భూమి అక్రమ రిజిస్ట్రేషన్ కు స్కెచ్
- భూమి యజమానురాలు బతికుండగానే చనిపోయినట్లు పత్రాల సృష్టి..
- సుమారు రూ. 5 కోట్ల భూమిని ఆక్రమించిన కుటుంబ సభ్యుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారి
- దర్గాగా మడికొండలో అత్యంత విలువైన రెండున్నర ఎకరాలు కబ్జా బాగోతం
- కబ్జాదారులకు అండగా నిలిచిన తహసీల్దార్ కిరణ్ కుమార్
- బంధువులే రాబంధులుగా మారిన వైనం..
- సెట్ చేస్తానంటూ రూ.లక్షలతో మరో వ్యక్తి సెటిల్..
- బాధితురాలి పోరుతో వెలుగులోకి వస్తున్న సంచలన విషయాలు

డీల్@ రూ. 25 లక్షలు!

మరిన్ని వివరాలు రేపటి సంచికలో..

అక్షర దర్బార్, ప్రత్యేక ప్రతినిధి:

యజమానురాలికి తెలియకుండా ఆమెకు చెందిన రూ.కోట్ల విలువ చేసే రెండున్నర ఎకరాల భూమిని అక్రమంగా కొల్లగొట్టిన ఘటనలో తహసీల్దార్ పూజారి కిరణ్‌కుమార్ కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. హనుమకొండ జిల్లా కాజీపేట మండల తహసిల్దార్ గా పనిచేసిన సమయంలో ఆయన అంతులేని అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా భూముల రిజిస్ట్రేషన్లలో కిరణ్ కుమార్ ఇష్టారాజ్యంగా వ్యవహరించినట్లు తెలిసింది. ఈక్రమంలో కాజీపేట మండలం మడికొండలోని ఓ సర్వే నంబర్‌లో అత్యంత విలువైన రెండున్నర ఎకరాల భూమి చేతులు మారడం వెనుక సార్ తనదైన స్టైల్‌లో చక్రం తిప్పినట్లు సమాచారం. పక్కా ప్లాన్ ప్రకారం భూమి రిజిస్ట్రేషన్ జరిగినట్లు స్పష్టం అవుతుంది. కబ్జాదారులతో ముందుగానే ఒప్పందం చేసుకొని ఆ తర్వాత ఫైళ్లపై సంతకాలు పెట్టారని, ఇందుకోసం తహసీల్దార్ రూ. 25 లక్షల ముడుపులు పుచ్చుకున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. అనంతరం ప్లాట్లుచేసి విక్రయించంగా అందులోనూ సార్‌కు పర్సంటేజీ ముట్టినట్లు చెపుతున్నారు. భూమి యజమానురాలైన వృద్ధురాలు బతికుండగానే, చనిపోయినట్లు కేటుగాళ్లు నకిలీ పత్రాలు సృష్టిస్తే .. దాన్ని అడ్డుకోవాల్సింది పోయి.. తహసిల్దార్ వారితోనే చేతులు కలిపి తీరని అన్యాయం చేశారని బాధితురాలి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. అప్పటికే రెండున్నర ఎకరాల భూమి కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్న వృద్ధురాలికి న్యాయం చేస్తానంటూ నమ్మించి తెల్లకాగితాలపై వేలిముద్రలు తీసుకుని మోసం చేశాడు దర్గా కాజీపేటకు చెందిన మరో రా..బంధువు. భూమిని ఆక్రమించిన వారి నుంచి ఏకంగా రూ. లక్షలు తీసుకుని వృద్ధురాలిని నిండా ముంచాడు.

- అసలేం జరిగింది..

మడికొండ గ్రామానికి చెందిన వృద్ధురాలు కాళేశ్వరం లక్ష్మి వయస్సు 72 సంవత్సరాలు. భర్త రత్నయ్య 1988లో కన్నుమూశారు. ఒక్కగానొక్క కొడుకు అశోక్ రెండేళ్ల కిందట అనారోగ్యంతో చనిపోవడం వల్ల వృద్ధురాలు లక్ష్మి నా అన్నవారు లేక ఒంటరి అయిపోయారు. ఆమె పేరిట మడికొండలో ఉన్న 2 ఎకరాల 21 గుంటల భూమే (ఈ భూమి విలువ ప్రస్తుతం మార్కెట్ రేటు ప్రకారం సుమారు రూ.5 కోట్లు ఉంటుందని అంచనా) జీవనాధారం. ఈ భూమిని కాజేయాలని దగ్గరి బంధువు ఒకరు పెద్ద పన్నాగం పన్నారు. వరుసకు చిన్నమ్మ అయ్యే ఆమె ఆస్తిని దక్కించుకునేందుకు, ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారితో కలిసి నకిలీ పత్రాలు సృష్టించాడు. లక్ష్మి – రత్నయ్యలకు తానే వారసుడినని... వారు చనిపోయారని పత్రాలు సృష్టించి భూమిని మ్యుటేషన్ చేసుకున్నాడు. అనంతరం స్థానికంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే ఓ వ్యక్తికి దాన్ని విక్రయించాడు. వారు వ్యవసాయేతర భూమిగా మార్చుకొని ప్లాట్లుగా మార్చి రూ.కోట్ల వ్యాపారం చేసుకున్నారు. ఇదంతా 2023 సంవత్సరంలో జరిగింది. విషయం తెలిసి బాధితురాలు మరో బంధువుకు తన గోడు వెళ్లబోసుకుంటే ఆయన కూడా మోసగాళ్లతో చేతులు కలిపాడు. భూమిని ఆక్రమించిన వారి వద్ద నుంచి రూ.లక్షలు దండుకున్నాడు. అయిన వాళ్ల చేతుల్లోనే రెండుసార్లు మోసపోయిన ఆ వృద్ధురాలు సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలన్నింటినీ సేకరించింది. తనకు జరిగిన అన్యాయంపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈక్రమంలోనే హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యతోపాటు సీపీ అంబర్ కిషోర్ ఝూను ఇటీవల కలిసి ఫిర్యాదు చేశారు. మడికొండ పోలీస్ స్టేషన్‌లోనూ కంప్లైంట్ చేసింది. తాను బతికి ఉన్నానంటూ పింఛన్ పొందుతున్న పత్రాలను సైతం అధికారులకు సమర్పించారు. తన భూమి అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో ఏలకంగా వ్యవహరించిన అప్పటి కాజీపేట తహసీల్దార్ కిరణ్క ుమార్ భారీగా డబ్బులు దండుకొని తప్పుడు ధృవ పత్రాలతో ముటేషన్ చేయడం వల్ల తనకు తీరని అన్యాయం జరిగిందని లక్ష్మి కన్నీటి పర్యంతమవుతున్నారు. తన ప్రాణాలకు కూడా రక్షణ లేదని విలపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. రాబంధుల్లా మారిన బంధువులపై రేపటి సంచికలో కథనం..

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ గా రాణి కుమిదిని

విజిలెన్స్ కమిషనర్ గా గోపాల్ నియామకం

ఉత్తర్వులు జారీచేసిన తెలంగాణ సర్కార్

అక్షరదర్బార్, హైదరాబాద్ : రాష్ట్ర ఎన్నికల కమిషనర్గా విశ్రాంత ఐఏఎస్ అధికారి రాణి కుమిదిని నియమితులయ్యారు. 1988 బ్యాచ్కు చెందిన రాణి కుమిదిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. కేంద్ర సర్వీసుల అనంతరం తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా విధులు చేపట్టారు. 2023 ఎన్నికలకు ముందు పదవీ విరమణ చేశారు. అప్పటి కేసీఆర్ ప్రభుత్వం తిరిగి అదే హోదాలో కొనసాగించింది. తాజాగా రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ఎన్నికల కమిషనర్గా ఆమెను నియమించింది. ఇప్పటి వరకు ఎస్ఈసీగా ఉన్న పార్థసారధి పదవీ కాలం ఈ నెల ఎనిమిదో తేదీతో ముగిసింది. దీంతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్గా రాణి కుమిదినిని నియమించారు. ఈమేరకు ఆమెను ఎస్ఈసీగా నియమిస్తూ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆదేశాలు జారీ చేశారు. మూడేళ్ల పాటు రాష్ట్ర ఎన్నికల కమిషనర్గా కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నూతన ఎస్ఈసీ నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది. మరికొద్ది రోజుల్లో స్థానిక ఎన్నికలు జరగనున్నాయి.

విజిలెన్స్ కమిషనర్ గా ఎంజీ గోపాల్..

రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్ గా విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎంజీ గోపాల్ ను నియమించారు. 1983 బ్యాచ్ కు చెందిన ఎంజీ గోపాల్ ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణలో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన మూడేళ్ల పాటు బాధ్యతలు చేపట్టనున్నారు.

నిబంధనలు పాటించని వారిపై చర్యలు

వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు శ్రీపాల్

అక్షర దర్బార్,మహాదేవపూర్ : ఫర్టిలైజర్ యజమానులు నిబంధనలు పాటించకుండా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకు శ్రీ పాల్ హెచ్చరించారు. మంగళవారం మహాదేవపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో పలిమెల మహాదేవపూర్ మండలాల ఫర్టిలైజర్ యజమానులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి డీలర్ స్టాక్ రిజిస్టర్స్ అప్డేట్ చేస్తూ ఉండాలని, రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు బిల్లులు ఇవ్వాలని అన్నారు. ఎరువులను ఎక్కువ ధరలకు అమ్మితే కేసులు నమోదు చేసి లైసెన్సులు రద్దు చేస్తామని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

ఢిల్లీ సీఎంగా అతిశీ..

- ఆమ్ ఆద్మీ పార్టీ శాసనసభ పక్ష నేతగా ఎన్నిక
- ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన కేజ్రీవాల్ ..
- లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనాను కలిసి లేఖ అందజేత ..
- అతిపిన్న వయస్సులో పార్టీలో కీలక నేతగా ఎదిగిన అతిశీ..

అక్షరదర్బార్, ఢిల్లీ : ఢిల్లీ నూతన ముఖ్యమంత్రి ఎవరనేది తేలిపోయింది. అతిశీ మర్లెనా తదుపరి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) శాసన సభా పక్ష సమావేశంలో అధినేత అరవింద్ కేజ్రీవాల్ అతిశీ పేరును ప్రతిపాదించారు. ఇందుకు ఎమ్మెల్యేలు అంగీకారం తెలిపారు. అతిశీ పేరును సీఎంగా ప్రకటించిన తరువాత ముఖ్యమంత్రి పదవికి అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా చేశారు. మంగళవారం సాయంత్రం లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ సక్సేనాను కలిసి రాజీనామా లేఖ అందజేశారు. ఆయన వెంట శాసనసభా పక్ష నేత అతిశీ, ఇతర మంత్రులు ఉన్నారు. కాగా, ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న అతిశీ వయస్సు 43 సంవత్సరాలు. ప్రస్తుతం ఢిల్లీ ఎడ్యుకేషన్, పీడబ్ల్యూడీ వంటి కీలక శాఖల మంత్రిగా ఉన్నారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో చదువుకున్నారు. ఢిల్లీలోని పాఠశాలల్లో విద్య నాణ్యతను మరింత మెరుగుపరచడానికి కృషిచేశారు. కల్కాజీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసుకు సంబంధించిన కేసులో సిసోడియా అరెస్టయిన తర్వాత అతిశీ మంత్రి అయ్యారు. కేజ్రీవాల్, సిసోడియా జైలుకు వెళ్లిన సమయంలో ఆమె పార్టీలో కీలక నేతగా వ్యవహరించారు.

నమ్మకాన్ని వమ్ము చేయను..

‘ఢిల్లీ సీఎంగా నన్ను ఎంపిక చేసిన కేజ్రీవాల్‌కు ప్రత్యకంగా కృతజ్ఞతలు. నేను వేరే పార్టీలో ఉండి ఉంటే.. బహుశా నాకు ఎన్నికల్లో పోటీ చేసేందుకు టికెట్ కూడా దక్కేది కాదు. కానీ కేజ్రీవాల్ నాపై ఎంతో నమ్మకంతో నన్ను ఎమ్మెల్యేను, మంత్రిని చేశారు. ఈరోజు ముఖ్యమంత్రి బాధ్యతలు ఇచ్చారు. ఇలాంటిది ఆమ్ ఆద్మీ పార్టీలో మాత్రమే సాధ్యమవుతుంది. ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చిన నాకు ఇంతటి అవకాశం కల్పించిన కేజ్రీవాల్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయను’ అని అతిశీ పేర్కొన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ కేజ్రీవాల్ తన గురవు అని, కేజ్రీవాల్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా ఎన్నుకోవడమే తన లక్ష్యమని ఆమె అన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

బాల్యవివాహాలను నిర్మూలించాలి

జిల్లా కోఆర్డినేటర్ శాస్త్రాల తిరుపతి

అక్షర దర్బార్,భూపాలపల్లి: బాల్యవివాహాలను నిర్మూలించాలని కైలాష్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ తిరుపతి అన్నారు.మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కైలాష్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ సహాయ ఎన్జీవో ఆధ్వర్యంలో బాల్యవివాహాలు, బాల కార్మికుల నిర్మూలన బాలికలపై జరుగుతున్న లైంగిక దాడుల నిర్మూలనపై బాలికల సంరక్షణపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించి బాల్యవివాహాల రహిత భారత దేశం కోసం ప్రతినిత్యం పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించారు ఈ కార్యక్రమంలో ఘన్పూర్ సోషల్ మొగలైజర్ ఇనుగాల అశోక్, చెంచు మమత, రేగొండ మండల సోషల్ మోబిలైజర్ బలుగురి వెన్నెల, తదితరులు పాల్గొనడం జరిగింది.

మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి వెంకన్న

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలి

జిల్లా విద్యాధికారి వెంకన్న

అక్షర దర్బార్, మహాదేవపూర్: కళాశాలలో విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ముఖ్య వెంకన్న అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాల రికార్డుల పరిశీలన, ఎంసెట్ విద్యాబోధన విద్యార్థుల హాజరుపై ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులతో మాట్లాడుతూ కళాశాలకు రాని విద్యార్థులను ప్రత్యేకంగా కౌన్సిలింగ్ ఇచ్చి తీసుకురావాలని, అలాగే విద్యాబోధన సక్రమంగా నిర్వహించాలని అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్, అధ్యాపకులు సమ్మయ్య, సదాశివ్, సదానందం, సంధ్య, శ్వేత, రమాదేవి, పోచయ్య, శైలజ, చిన్నయ్య పాల్గొన్నారు.

భక్తులను చితకబాదిన పోలీసులు..

- **దెబ్బలు తాళలేక పరుగెత్తిన యువకులు**
- **చేజింగ్ చేసి మరీ చితకొట్టిన రక్షక భటులు**
- **ప్రాణాపాయస్థితిలో ఎంజీఎంలో చేరిన బాధితుడు**

అక్షర దర్బార్, పరకాల: గణనాథులను నిమజ్జనం చేసిన అనంతరం ఇంటికి తిరిగి వస్తున్న భక్తులపై దామెర ఎస్సై, పోలీసులు అకారణంగా దాడి చేసి చితక్కొట్టిన ఘటన నడికూడ మండలం కంఠాత్మకూరు గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం..కంఠాత్మకూరు గ్రామానికి చెందిన పలువురు భక్తులు గ్రామ సమీపంలోని వాగులో గణనాథులను నిమజ్జనం చేయడానికి వెళ్లారు. ఆ సమయంలో అక్కడే ఉన్న పోలీసులు త్వరగా నిమజ్జనం పూర్తి చేయాలని తీవ్రమైన ఒత్తిడి చేశారు. ఈ క్రమంలో నిమజ్జనం చేసి తిరిగి వస్తున్న పలువురు భక్తులపై పోలీసులు విచక్షణా రహితంగా దాడులకు దిగారు. ఈ దాడుల్లో గట్టు నవీన్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని మంగళ వారం పరకాల సివిల్ హాస్పిటల్ లో తరలించగా, అక్కడ చికిత్స అందించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని పేర్కొంటూ వరంగల్ ఎంజీఎంకు రెఫర్ చేశారు. కాగా, తమపై దాడి చేయొద్దని దామెర ఎస్సై డ్రైవర్ కు పలువురు భక్తులు డబ్బులు ఇచ్చినట్లు సమాచారం. అయినా విడవకుండా దాడి చేశారని బాధితులు మొరపెట్టుకుంటున్నారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గట్టు నవీన్

అమరుల త్యాగాల స్ఫూర్తితో ఉద్యమిద్దాం

సాయుధ పోరాటానికి వారసులు కమ్యూనిస్టులే

సీపీఐ పట్టణ కార్యదర్శి సొతుకు ప్రవీణ్

అక్షర దర్బార్, భూపాలపల్లి:తెలంగాణ రైతాంగం పోరాట యోధుల స్ఫూర్తితో ముందుకు కొనసాగించాలని సిపిఐ పట్టణ కార్యదర్శి సోత్కు ప్రవీణ్ కుమార్ అన్నారు. సెప్టెంబర్ 17న విలీన దినోత్సవ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా సందర్భంగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక రావి నారాయణరెడ్డి భవన్ లో సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన యోధుల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమించాలని పేర్కొన్నారు. రైతాంగ సాయుధ పోరాటాన్ని ఈ ప్రభుత్వాలు వక్రీకరిస్తున్నాయని మండిపడ్డారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అసలైన వారసులు కమ్యూనిస్టులేనని అన్నారు. రాబోయే రోజుల్లో వారి ఆశయాలతో సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు కొరిమి సుగుణ, మాతంగి రామచందర్, నేరెళ్ల జోసెఫ్,లోకిని రమేష్,దేవా,వనిత,గడ్డం స్వరూప,రక్షిత,రజిత,చారి,కర్ణకర్ పాల్గొన్నారు

జెండా ఎగురవేస్తున్న ప్రవీణ్

పరకాల పీఏసీఎస్ చైర్మన్ గా రాజేందర్ రెడ్డి

అక్షర దర్బార్, పరకాల : పరకాల పీఏసీఎస్ చైర్మన్ గా చందుపట్ల రాజేందర్ రెడ్డిని నియమించినట్లు డిస్ట్రిక్ట్ కోపరేటివ్ ఆఫీసర్ నీరజ తెలిపారు. పీఏసీఎస్ లో జరిగిన అవకతవకలపై అధికారులు విచారణ జరిపిన అనంతరం నాగయ్యను చైర్మన్ పదవి నుండి తొలగించి నూతన చైర్మన్ గా రాజేందర్ రెడ్డిని నియమించినట్లు నీరజ తెలిపారు.

ఓసీపీ బాంబు మోతలతో కూలుతున్న ఇండ్లు, గోడలు

ఆదుకోవాలని కోరుతున్న బాధితులు

అక్షర దర్బార్, మల్హర్ : తాడిచెర్ల ఓసీపీలో బాంబుల మోతలతో ఆదివారం రాత్రి అనుమాల కొమురక్క బాపు దంపతులకు చెందిన పెంకుటిల్లు,ఇంటి గోడలు పాక్షికంగా కూలిపోయాయి. ఆ సమయంలో వారు ఇంట్లో లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. తమను ఆర్థికంగా ఆదుకోవాలని సోమవారం బాధితులు తహశీల్దార్ రవికుమార్ కు వినతిపత్రం అందజేశారు. పలుమార్లు జెన్కో అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, ఉన్నతాధికారులు స్పందించి నష్ట పరిహారం అందించాలని కోరారు.

కూలిన గోడలను చూపిస్తున్న బాధితులు

ఘనంగా మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు

ఈద్గా మసీద్ వద్ద ఖీర్ ఫాతిహా..

అక్షర దర్బార్, పరకాల : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మహ్మద్ అలీ, జామ మసిద్ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం ఈద్ మిలాద్ ఉన్ నబి ఉత్సవాల సందర్భంగా పరకాల బస్ స్టాండ్ సెంటర్ లో ఈద్గా మసీద్ వద్ద ఖీర్ ఫాతిహా (ప్రసాదం) చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి , ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, కౌన్సిలర్ మడికొండ సంపత్, పర్నేం మల్లారెడ్డి, దుబాసి వెంకటస్వామి, పల్లెబోయిన శ్రీనివాస్, అల్లం రఘు నారాయణ, దాసరి బిక్షపతి, దుగ్యాల రాజేశ్వరరావు, అఫ్జల్, ఖలీమ్, అఫ్రోజ్,సమీర్, మజార్ అలీ, మన్సూర్ అలీ, ఇమ్రాన్, గౌస్, అస్లామ్, షఫీ, ఖాసిం, మచ్చ సుమన్,నాగరాజు, రవికుమార్, సదన్ కుమార్, ముస్లీం మత గురువులు పెద్దలు ముస్లిం సోదరులు తదితరులు సంఖ్యలో పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు

తెలంగాణ జర్నలిస్టుల హెల్త్ కమిటీ సభ్యుడిగాసామల శ్రీనివాస్

అక్షర దర్బార్,భూపాలపల్లి:తెలంగాణ జర్నలిస్టుల హెల్త్ కమిటీ సభ్యుడిగా శ్యామల శ్రీనివాస్ ఎన్నిక ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర టీయూడబ్ల్యూజే ఐజేయు ఎగ్జిక్యూటివ్ సమావేశంలో టీయూడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర అధ్యక్ష , కార్యదర్శులు విరహత్ అలీ, రాంనారాయణ కలిసి ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్ కుమార్ తెలిపారు. గతంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా సేవలందిస్తున్నందుకు గుర్తించి రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలిస్టుల ఆరోగ్యం పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తున్న యూనియన్ టియుడబ్ల్యూజే ఐజేయూ యూనియన్ తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలిస్టుల హెల్త్ సమస్యలపై ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ వారికి సేవలు చేసే విధంగా కమిటీ పనిచేస్తుందని అధ్యక్ష కార్యదర్శులు విరహత్ అలీ,రామ్ నారాయణ అన్నారు. తన ఏన్నిక కు సహకరించిన జిల్లా అధ్యక్ష కార్యదర్శుల క్యాతం సతీష్ కుమార్ శామంతుల శ్యామ్ కుమార్ కు భూపాలపల్లి జిల్లా శాఖకు తెలంగాణ హెల్త్ కమిటీ నూతన సభ్యుడు సామల శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలియజెశారు

అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక

వరంగల్‌పై సీఎం ప్రత్యేక దృష్టి

- విద్య, వైద్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం
- పాత్రికేయులకు ఇంటి స్థలాలు అందిస్తాం..
- అర్హుల జాబితాను కమిటీలు అందజేయాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్షా సమావేశం

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పాల్గొన్న మంత్రి సురేఖ

అక్షరదర్బార్, హన్మకొండ : హైదరాబాద్ తర్వాత రెండో అతిపెద్ద నగరమైన వరంగల్ సమగ్రాభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టిని సారించారని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్షా నిర్వహించారు. ఈసందర్భంగా జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశం, పోచమ్మ కుంట మోడల్ గ్రేవీ యార్డ్, గ్రేటర్ వరంగల్ పరిధిలోని పార్కు స్థలాల ఆక్రమణ, రీజినల్ సైన్స్ సెంటర్ భూమి ఆక్రమణ, నాలాల ఆక్రమణలు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన పనులు, వాటి పురోగతి, నిధుల కేటాయింపు, డంపింగ్ యార్డ్, కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులు, ఓ ఆర్ ఆర్ పనులు, కాజీపేట ఆర్ఓబి, తదితర అంశాలపై హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్డీవో వెంకటేష్, కుడా పీవో అజిత్ రెడ్డి, మున్సిపల్, సాగునీటి పారుదల, ఆర్ అండ్ బి, తదితర శాఖల అధికారులతో ఆయా అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడారు.

జర్నలిస్టులకు ఇంటి స్థలాలిస్తాం..

వరంగల్ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత నిస్తుందన్నారు. వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి నిధులను కేటాయిస్తామన్నారు. పేదలకు పెద్దదిక్కుగా వరంగల్ ఎంజీఎం రోగులకు మెరుగైన వైద్యం అందే విధంగా పర్యవేక్షించాలన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద ముప్పు నుండి ప్రజలను హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు, అధికారులు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కాపాడినందుకు మంత్రి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. పాత్రికేయులకు ఇంటి స్థలాల కేటాయింపు విషయంలో తమ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, తప్పకుండా ఇంటి స్థలాలను అందిస్తామన్నారు. గత ప్రభుత్వం పాత్రికేయుల ఇంటి స్థలాల విషయంలో కాలయాపన చేసిందని పేర్కొన్నారు. అలా కాకుండా అర్హులైన వారి జాబితాను ఆయా కమిటీలు అందిస్తే ఇంటి స్థలాలను కేటాయించేందుకు ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకుంటుందన్నారు. ఇంటి స్థలాల విషయంలో ఆయా యూనియన్లు రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డితో ఒకసారి సమావేశమై చర్చించాలన్నారు.

ఆక్రమణలు ఉపేక్షించం..

నాలాలపై ఎలాంటి నిర్మాణాలు ఉన్న ఉపేక్షించవద్దని, ఎంతటి వారు ఉన్న వాటిపై అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి అన్నారు. నాలాలపై నిరుపేదలు ఉన్నట్లయితే వారికి సరైన చోట నివాసం ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ భూమిని ప్రభుత్వమే తీసుకుంటుందని, ఎంత పెద్ద వాళ్ళు తీసుకున్న ప్రభుత్వం ఊరుకోదన్నారు. కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులు ఏవైనా ఉన్నట్లయితే వాటిని వెంటనే పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కళాక్షేత్రం ప్రారంభోత్సవం కోసం వచ్చే నెల 2న ముఖ్యమంత్రి పర్యటన ఉండనుందని పేర్కొన్నారు. వరంగల్ విమానాశ్రయం సంబంధించిన వివిధ అంశాలపై ఆర్ అండ్ బి మంత్రితో చర్చించనున్నట్లు తెలిపారు. డంపింగ్ యార్డ్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పర్యావరణ అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, అదనపు కలెక్టర్లు వెంకట్ రెడ్డి, సంధ్యారాణి, సంబంధిత శాఖల అధికారులు, మున్సిపల్, కుడా అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రజా పాలన..

- ఉమ్మడి జిల్లాలో వైభవంగా వేడుకలు
- వరంగల్ లో జాతీయ జెండాను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి..
- హన్మకొండలో కొండా సురేఖ, ములుగులో సీతక్క..

అక్షరదర్బార్, హన్మకొండ: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని ఉమ్మడి జిల్లాలో ఘనంగా నిర్వహించారు. వరంగల్ లో వేడుకలకు ముఖ్య అతిథిగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. హన్మకొండ, ములుగులో మంత్రులు కొండా సురేఖ, సీతక్క జాతీయ జెండాలను ఎగురవేశారు. మహబూబాబాద్ జిల్లాలో డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, జనగామలో ఆలేరు ఎమ్మెల్యే, విప్ బీర్ల ఐలయ్య, భూపాలపల్లిలో అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జాతీయ జెండాను ఆవిష్కరించిన వారు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

చారిత్రక సందర్భం : మంత్రి పొంగులేటి

తెలంగాణ రాష్ట్ర చరిత్రలో సెప్టెంబర్ 17వ తేదీకి ఒక ప్రత్యేకత ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన సెప్టెంబర్ 17వ తేదీని.. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవంగా జరుపుకోవాలని కాంగ్రెస్ సర్కార్ నిర్ణయించిందని వెల్లడించారు. ఈ క్రమంలోనే.. రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ ప్రజాపాలనా దినోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయని తెలిపారు. ఎందరో త్యాగధనుల పోరాటాల ఫలితంగానే ఈ రోజు స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నామని.. వారందరినీ గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆ త్యాగదనులందరి సేవలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్మరించుకున్నారు. వరంగల్ నగరం వరద ముంపునకు గురికాకుండా.. అన్ని రకాల చర్యలు తీసుంటున్నట్టు మంత్రి పొంగులేటి తెలిపారు. వరద నీరు సాఫీగా వెళ్లిపోయేందుకు.. నగరవ్యాప్తంగా నాలాలను నిర్మిస్తున్నామని చెప్పుకొచ్చారు. వరంగల్ జిల్లాలో నిరాధారణకు గురైన.. కాకతీయ కాలంనాటి చారిత్రాత్మక దేవాలయాలను పునరుద్ధరించి నిత్యం పూజలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

ప్రజాపాలన వేడుకలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు

ఉప్పరపల్లి ఊరచెరువుపై పట్టింపేది?

- కట్టకు గండిపడి వృథాగా పోతున్న నీళ్లు
- పట్టించుకోని అధికారులు
- చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, రైతుల డిమాండ్

కట్టకు గండి పడడంతో వృథాగా పోతున్న నీళ్లు

అక్షర దర్బార్,కేసముద్రం: ఇటీవలే కురిసిన భారీ వర్షాలకు కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామంలోని ఊర చెరువు మత్తడి వద్ద కట్టకు గండి పడ్డ విషయం విధితమే. ఈ క్రమంలో చెరువుకు అడ్డుకట్ట వేయడానికి గ్రామస్తులు,సొసైటీ సభ్యులు ఎంతగా ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో సంబంధిత ఇరిగేషన్ అధికారులు కట్టకు తాత్కాలికంగా మరమ్మత్తులు చేసి చేతులు దులుపుకున్నారు. కట్టను పూర్తిస్థాయిలో శాశ్వతంగా పునర్నిర్మిస్తే తప్ప చెరువులో నీరు ఉండని దుస్థితి. భారీ వర్షాలకు కట్టకు గండి పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువు కట్టను ఈ మధ్య కాలంలోనే స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ స్వయంగా పరిశీలించారు.శాశ్వత పరిష్కారం కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు.అయితే అధికారులు మాత్రం తూతూ మంత్రంగా కట్టకు మరమ్మత్తులు చేయడంతో గండిని నిలువరించలేకపోయారు. దీంతో చెరువులోని నీళ్లన్ని వృధాగా పోతున్నాయి. అప్రమత్తమైన గ్రామ కాంగ్రెస్ నాయకులు మంగళవారం గండి పడ్డ చెరువు కట్టను పూడ్చడంతో ప్రస్తుతం నీళ్ల బయటకు పోకుండ ఆగిపోయాయి. కట్టపై ఇరిగేషన్ అధికారులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.